# ఒంటరి గులకరాయి!

**-కె. మంజులత**

'అతను-ఆమె'

ఒకరికెదురుగా ఒకరు, మొదటిసారి కలిగే అనుభూతిలోని ఆనందాన్ని అనుభవిస్తూ, దగ్గరితనాన్ని ఫీల్ అవుతూ కూర్చున్నారు. మొదటిసారి కలిగే ఏ భావమైనా చాలా అందంగా, ఆహ్లాదంగా వుంటుందట. ఇప్పుడు, సరిగ్గా వారిద్దరిలోనూ అలాంటి భావాలే మెదులుతున్నాయి.

కొత్తగా, కొత్తకొత్తగా-

ఏదో చెప్పాలనే ఆత్రుత, ఏమీ చెప్పలేని నిస్సహాయత కలిపితే వారి మానసిక స్థితి!

సంధ్య నింగికంత కెంజాయరంగునలుముతోంది. పచ్చికపై నుండి వీచేగాలి చల్లగా తెరలు తెరలుగా వారిరువుర్నీ స్పృశిస్తోంది. ఆమె బిల్‌గేట్స్ గురించనుకుంటా చెప్తోంది మాటిమాటికీ నుదుటిపై పడే ముంగురుల్ని సుతారంగా సవరించుకుంటూ. మాట్లాడటమైతే చేస్తోంది కానీ మనసు మాత్రం ఎటో వుంది.

అతనూ విన్నట్లే ఉన్నాడు, కానీ ఆమె ముద్దు మొహం చూడటంలో నిమగ్నమై మనసుకు మాత్రం ఏమీ ఎక్కించుకోవటం లేదు. ఆమెకి మల్లెపూలు కొనిపెట్టాలన్న కోరికను ప్రయత్నంగా తొక్కిపెట్టేసాడతను ఆ మల్లెపూల కుర్రాడివైపు యధాలాపంగా చూస్తూ.......

సూర్యుడు కొంచెం కిందకి జారే సరికి ఆమె అతన్ని నిలదీస్తోంది.

ఇంటర్ కాలేజ్ క్విజ్ కాంపిటీషన్‌లో అతనికి సెకండ్ ర్యాంక్ మాత్రమే ఎందుకొచ్చిందని? సమాధానం చెప్పకుండా నవ్వేస్తున్న అతని మనసులో ఆనందం, అతనిపట్ల ఆమె కన్సర్న్ గురించి. అతని నవ్వులో అందాన్ని చూస్తున్నా ఆమె ముఖంపై తెచ్చిపెట్టుకున్న కోపం కదలాడాయి.

పల్చని చీకటిపొర ఆకాశాన్ని కప్పుతోంది.

అతనూ లేచాడు ఆమెతోపాటు. ఆమె చాలా కంగారు పడిపోయింది ఇంటికెళ్ళాలని, మనస్సులో ఆగిపోని కాలాన్ని నిందిస్తూ.....

అతనొక్క క్షణమామె కళ్ళలోకి పరిశీలనగా చూసాడు. ఆ చూపామెలో చాలా కలవరాన్నే రేపింది. కానీ ఆమె అదేమీ గమనించనట్లే కళ్ళు వాల్చుకుంది.

ఇద్దరూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కానీ మనసులు మాత్రం ఆ పారిజాత వృక్షం కింద, ఆ పచ్చిక మీద పారేసుకున్న అనుభూతి ఇద్దర్నీ వీడలేదు!

అలాంటి కలయికల తర్వాత అతను నిద్రను దూరం చేసుకుంటాడనటానికి సాక్ష్యం అతని డైరీయే చెప్తుంది. అతని డైరీలో 'ఆమె'-

సౌందర్యం సైతం చిరునామా వెతుక్కునే ఆ నవ్వులో పోగొట్టుకున్న నా మనసు కన్పిస్తుంది. తిరిగి తీసుకోవాలనుకుంటాను. కమలాలేమో! ఆ కనులు నన్ను అశక్తుణ్ణి చేస్తాయి.

ఆమె జ్ఞాపకాల సైకత తీరాల్లో అనుభూతుల్నేరుకోవాలని ఏదో చిన్ని ప్రయత్నం చేస్తాను. విచ్చుకునే అనుభూతుల గులాబీ తోటలో ప్రతి పువ్వూ ఆమే. అప్పుడనుకుంటాను.

జీవితానికేం మిగిలింది ఆమె తప్ప అని. చిత్రంగా-

బాధనిపించదు. స్వప్నం ఆమైతే మెలకులో కూడా కనులు మూసుకుని స్వప్నించడాన్ని నేను ప్రేమిస్తాను. నాకంటే ముందే మేల్కొని, నా తర్వాత నిద్రపోయే ఆమె జ్ఞాపకాలు నన్నొక చిత్రకారుణ్ణి చేస్తాయి. కాన్వాసు లేకపోతేనేం మనసుందిగా ఆమెను చిత్రించుకోవటానికి.

★★★

ఈ రోజు-

నా కాలికి చిన్ని ఫ్రాక్చర్ అయిందని నేనప్పుడు ఆమె కళ్ళలో పల్చటి నీటి పొర కదలాడలేదూ అంటే అది ప్రేమతో కాదూ! నాది ప్రేమేమోనని చిన్ని సందేహం.

నాకు నన్ను చూసుకుంటే చాలా ఆశ్చర్యం కల్గుతోంది. నేనేనా ఒక ఆడపిల్ల కోసం ఇంతగా తపిస్తుంది. 'ఎంతవారలైనా కాంతదాసులే' అని ఊరికే అనుండరు కదా!

★★★

ఈరోజు-

నా మనసంతా ఆమెకు చెప్పాలనుకున్నాను. ఆమెతో గడిపిన అన్ని గంటల కాలంలోనూ ఒకటే పరిస్థితి.

'గుండె గొంతుకలోన కొట్లాడతాదీ
కూకుండనీదురా కూసింతసేపు'

నండూరి వారు నా కోసమే అలా రాశారేమో! లేకపోతే నేనేమై పోయేవాణ్ణో నా పరిస్థితికో రూపం ఇచ్చుకోలేక!

★★★

ప్రియా!

నీకు తెలుసా?

చంద్రుడీమధ్య నాకు ప్రియనేస్తమై పోయాడు.

నీ జ్ఞాపకాల సుమాలల్లి తెస్తున్నాడు.

ఒక చంద్రుడేమిటీ! సమస్త ప్రకృతంతా నాదే-

ఈ విశాలప్రకృతిలో ఏవి చూసినా నీ తలపే గుర్తుకొస్తోంది. యావత్ప్రకృతీ చైతన్యరూపం ధరించి, ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ప్రకృతిమీదో, నామీదో ఏమత్తు జల్లావో నీకేవరుక!

జీవితాన్ని రాగరంజితం చేసేదేదైనా ఇంకా ఇంకా ప్రియంగా మధురంగా వుంటుంది. వాటికా అందం నీ ఊహల వల్లే వచ్చిందేమోనన్పిస్తోంది సుమా!

★★★

ఎప్పటిలానే ఈ రోజు కూడా అనుకున్నాను తనంటే నాకేమిటో చెప్పాలని. కానీ భావానికి భాష చాలటం లేదు. మనస్సు మాత్రం వుంది. కానీ ఏం లాభం?

నా మౌనం ప్రేమగీతమై ఆమెని ముంచేస్తే బావుండు
నా కళ్ళవాకిళ్ళలోంచి భావోద్వేగపు కెరటాలు
ఆమెని నాలో కలిపేస్తే బావుండు
నా హృదయవనంలోని ప్రేమ గులాబీ ఆమె జడలో
జాజిదండైతే బావుండు
నా మనస్సు నందివర్ధనమై ఆమె చరణాల చెంత
చేరితే బావుండు
ఆమె మనఃమందిరాన నేనే దైవమైతే-
ప్రభూ ఈ జీవితానికింకేం కావాలి?

కానీ-

ఆమె మనసేంటో? తెలీదు...

తెలీనివ్వదు కదా!

ఆమె మనసులోని మాట-

అతనితో పరిచయం జరిగాకేననుకుంటా చీర కట్టులోని అందం తెలిసింది. ఆ కళ్ళలోని మెచ్చుకోలుకు మించిన పొగడ్తలుంటాయా? కానీ నోటితో మాత్రం ఏమీ చెప్పడు కదా!

అసలు మా ఇద్దరి సంభాషణెవరయినా వింటే నవ్విపోతారేమో కూడా. అంత పొడిపొడిగా వుంటుంది మరి. నేను ఇంటర్‌నెట్ గురించి, హైటెక్ సిటీ గురించి తనేమో న్యూ ఎకనమిక్ పాలసీ గురించి, జన్మభూమి గురించి, మనసుల్ని కప్పెట్టాలని ఎందుకంత ప్రయత్నమో అర్థం కాదు. అవును, అసలు ప్రేమికులేం మాట్లాడుకుంటారు?!

అతన్ని చూస్తే నాకెప్పుడూ అన్పిస్తుంటుంది ఉన్నతమైన ఆలోచనాసరళి, సామాన్యజీవనం అని. అలాంటి వ్యక్తితో జీవితం అందం, ఆనందం కలనేతగా వుంటుందనీను. కానీ అతనితో అలా అని చెప్పలేకపోతున్నాను. అహం అడ్డొస్తోంది. ఏం చేయను?

మగాడు కదా. కాస్త చొరవ చూపించవచ్చు కదా. తానే ముందుగా చొరవ తీసుకుని నాతో లైఫ్ షేర్ చేసుకుంటానని ఎందుకు చెప్పడూ? నాకూ తెలుస్తోంది అతనిలో నాపై ప్రేముందని. నోటితో చెప్పకపోయినా, కళ్ళతోనే ప్రేమించటాన్ని అనుభవంలోకి తెస్తున్నాడు. పోనీ నేనో? నేను బయటపడలేకపోతున్నాను. అలవాటయిపోయిన 'హిపోక్రసీ' అంత త్వరగా వదులుతుందా?

తనే అన్నాడు ఒకరోజు-

నేనబద్ధం ఆడితే అతని ముందతకదట. నిజమే. మరింత పరిశోధించాడుగా, చిటికలో ఇట్టే కనిపెట్టేస్తాడట! నిజమే మరింత పరిశోధించాడుగా, ఇంత స్నేహం తర్వాత నాకతనిష్టమని తెలుసుకోలేక పోయినాడా? తెలిసే వుంటుంది. కానీ పురుషాహంకారం అడ్డొచ్చిందేమో. లేకపోతే! నా దగ్గర చులకనై పోతానని భయమేమో!

పోనీ నేనే ముందుగా చెప్పొచ్చుగా. ఎందుకు ప్రపోజ్ చేయలేకపోతున్నాను? ఏదో స్త్రీ సహజ బిడియం మనస్సును వెనక్కి లాగుతోంది, మరి!

ఎంతో జాగ్రత్తగా వుంటాడు. అన్నీ అర్థం చేసుకున్నట్టే కనిపిస్తాడు. కానీ కొంచెం కూడా చొరవ చేయడెందుకు? భయమా? బిడియమా? పురుషాహంకారమా! పలుచన అవుతానని సంకోచమా?- ఏదీ ఇదమిద్ధంగా తెలీదు.

ఏదేమైనా అతనితో జీవితం పంచుకోవటాన్ని నేను ప్రేమిస్తాను. ఇప్పుడు, ఎప్పుడూ, ఎన్నేళ్ళ తర్వాతైనా సరే! నిశ్చయం! తిరుగులేనిది!

ఎన్నో ఏళ్ళ తర్వాత-

ఈరోజు -

ఇంటిముందున్న ఎర్రగులాబీ మొక్కకామె నీళ్ళు పడుతోంది. తనామొక్కకలా శ్రద్ధగా నీళ్ళు పెట్టేటప్పుడల్లా అతనే గుర్తొస్తుంటాడు. ఇంతలో ఆమె రెండేళ్ళ చిన్ని బాలూ ఆమె చేతిలోంచి పైపు లాక్కున్నాడు తనే నీళ్ళు పెడతానంటూ. ఆమె త్వరత్వరగా లోపలికెళ్ళింది ముసురుకుంటున్న అతని ఆలోచనల్ని బలవంతంగా పక్కకి నెట్టేస్తూ. మధురమైన అనుభూతులెప్పటికీ మనోమందిరంలో తాజాగానే వుంటాయి. వాటిని మరువలేమని తెలిసినా ఆమె మనసును కసురుతూంటుంది అతన్ని జ్ఞప్తి చేస్తుందనే నెపంతో.



ఆమె భర్త వినయ్‌తో చెప్తోంది. ''వచ్చే సంక్రాంతికి మా ఊరెళ్దామండీ'' అని. వినయ్ సరేనన్నట్టున్నాడు. ఆమె అందంగా నవ్వింది. ఇప్పటికీ ఆమెకా సంక్రాంతి సంబరాల్లో, మరెన్నో మధుర సంతోష సమయాల్లో అతను తప్పక గుర్తొస్తూనే వుంటాడు. ఆమె చిన్నగా నవ్వుకుంటుంది. ఇప్పటికీ అతను గుర్తొస్తే నాటి పరిచయాల రోజులు, అతని దగ్గరతనం- అంత ఫ్రెష్‌గానూ వుంటుందని!

కాని జీవితమంటే సర్దుబాటు అని తెల్సిపోయాక అతను ఆమె గతం ఒడ్డున వున్న గులకరాయి మాత్రమేనని!

★